

ఆధిక్యంలో చిత్తూరు జట్టు
ఏసీఏ అండర్‌-23 అంతర్‌ జిల్లాల మల్టీ డేస్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ ఉత్సాహంగా సాగుతోంది. చిత్తూరు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. -8లో



డిజిటల్‌ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్‌
జిల్లా పంచాయతీశాఖలోని డిజిటల్‌ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్‌ ప్రక్రియ గురువారం జరిగింది. ఈ కౌన్సెలింగ్‌కు 167 మంది డిజిటల్‌ అసిస్టెంట్లు హాజరయ్యారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.8/26.6

జిల్లాలో గురువారం 26.6 - 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్‌



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్‌.

కఠినంగా శిక్షించాలి


ప్రజలకు తమ ప్రాణాలను పణంగా పెట్టి కాపాడుతున్న వైద్యులు, సిబ్బందిపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే విధంగా చట్టాలు ఉండాలి. ఇటీవల దేశంలో ఎక్కడో చోట మానవ మృగాలు వైద్యులపై దాడులకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి పూట విధులు నిర్వహించే వైద్యులను రక్షణ కల్పించాలి.
-సువర్ణ కుమారి, స్టాఫ్‌నర్స్‌, జమ్మలమడుగు

రాత్రివేళల్లో భద్రత పెంచాలి


కోల్‌కతా వైద్య కళాశాలలో డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటన యావత్‌ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులతోపాటు సిబ్బంది ప్రాణ రక్షణ, భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక పోలీసు ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. కొంతమంది మద్యం సేవించి వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. - డాక్టర్‌ నూర్‌ మోహిద్దీన్‌, కడప

వైద్యులకు రక్షణ కల్పించాలి


రోగులకు ఏదైనా జరిగితే వెంటనే రోగుల బంధువులు విధుల్లో ఉన్న వైద్యులపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. డాక్టర్లు ప్రాణాలు కాపాడుతారే కానీ ప్రాణాలు తీయరని వారికి కూడా తెలుసు. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన హత్యాచార సంఘటన కలిచివేసింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చట్టాలు తేవాలి. వైద్యుల విధులకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
- సుకుమార్‌, ఆరోగ్య విస్తరణాధికారి, సింహాద్రిపురం మండలం

భద్రత ముఖ్యం


ఏ సంస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులైనా, చదువుతున్న విద్యార్థులకైనా భద్రత కల్పించడం ముఖ్యం. కోల్‌కతాలో జరిగిన ఘటన దారుణం. ఈ విషయంలో పోలీస్‌ పెట్రోలింగ్‌ పెంచాలి. అలాగే భద్రతపై అవగాహన కల్పించాలి. -బి. శ్రీకాంత, గ్రేడ్‌-1 నర్సింగ్‌ సూపరింటెండెంట్‌, సూపర్‌ స్పెషాలిటీ హాస్పిటల్‌, రిమ్స్‌, కడప

న్యూస్‌రీల్‌

నేడు 'డయల్‌ యువర్‌ డీఎం'
కడప కోటిరెడ్డిసర్కిల్‌: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కడప డిపో మేనేజర్‌ డిల్లీశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 99592 25774 నెంబరుకు ఫోన్‌ చేసి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.

1న అండర్‌-14 క్రికెట్‌ ఎంపికలు
కడప స్పోర్ట్స్‌: కడప నగరంలోని వైఎస్‌ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్‌ మైదానంలో సెప్టెంబర్‌ 1న జిల్లాస్థాయి అండర్‌-14 క్రికెట్‌ ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రికెట్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ వైఎస్సార్‌ డిస్ట్రిక్ట్‌ (సీఏవైడీ) కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్‌ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 01-09-2010 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు బర్త్‌ సర్టిఫికెట్‌, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రికెట్‌ కిట్‌తో హాజరుకావాలని సూచించారు. అదే విధంగా మూడేళ్ల ప్రోగ్రెస్‌ రిపోర్ట్‌ తీసుకురావాలని తెలిపారు.

జిల్లాకు యూరియా రాక


లారీలలోకి ఎక్కిస్తున్న యూరియాను పరిశీలిస్తున్న జేడీఏ కార్యాలయ వ్యవసాయ అధికారి గోవర్ధన్‌

కడప అగ్రికల్చర్‌: కోరమాండల్‌ కంపెనీకి చెందిన 1320 మెట్రిక్‌ టన్నుల యూరియా జిల్లాకు వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు తెలిపారు. ఇందులో 1000 మెట్రిక్‌ టన్నులు వైఎస్సార్‌ జిల్లాకు కేటాయించగా మరో 320 మెట్రిక్‌ టన్నులను అన్నమయ్య జిల్లాకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్‌ జిల్లాకు కేటాయించిన 1000 మెట్రిక్‌ టన్నుల యూరియాలో 540 మెట్రిక్‌ టన్నుల యూరియాను ప్రైవేటు డీలర్లకు కేటాయించగా మరో 460 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాలకు తరలించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని తెలిపారు. డీలర్లు ఎవరైనా ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధికంగా ధరలకు అమ్మితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సారూ.. సర్దుకోవాల్సిందే!

- ఎస్‌జీటీలతో బలవంతపు సర్దుబాట్లు
- ప్రాథమిక పాఠశాలకు శాపంగా మారిన ప్రక్రియ
- మళ్లీ ఏకోపాధ్యాయులుగా మారనున్న పలు ప్రాథమిక పాఠశాలలు



గోపవరం మండలం సండ్రపల్లె ప్రాథమిక పాఠశాల



కడప ఎడ్యుకేషన్‌: జిల్లాలో సర్దుబాటు ప్రక్రియ ఒక ప్రహసనంగా మారింది. ప్రాథమిక విద్యకు.. ఉపాధ్యాయులకు పోటుగా తయారైంది. ఈ నెల 8వ తేది నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ సాగుతూ ... ఉంది. ముక్కుతూ మూలుగుతూ ఇప్పటికి మండలస్థాయి సర్దుబాటును పూర్తి చేశారు. ఈ ప్రక్రియ వారాల తరబడి సాగుతుండటంతో పాఠశాలల్లో బోధన గాలిలో దీపంలా మారింది. సర్దుబాటులో ఏ పాఠశాలకు పోవాల్సి వస్తుందోనన్న ఆలోచనతో ఉపాధ్యాయులు బోధనలపై మనసును నిమగ్నం చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాలకు శాపంగా మారనుంది. మళ్లీ ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరగనుంది. గతంలో ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి సర్దుబాటు చేశారు. కానీ మళ్లీ మెథడాలజీ ఉన్న ఎస్‌జీటీలకు బలవంతంగా సబ్జెక్టు టీచర్లుగా సర్దుబాటు చేస్తున్నారు. ఇది విల్లింగ్‌లేని ఎస్‌జీటీలకు తలనొప్పిగా మారింది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన మూడు నెలల తరువాత ఈ సర్దుబాటు ప్రక్రియ చేపట్టడంపై మేధావులు, విద్యావంతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా హైస్కూళ్లలో....
జిల్లావ్యాప్తంగా హైస్కూళ్లలో అవసరమైన మేరకు సబ్జెక్టు టీచర్లను కేటాయించడమే లక్ష్యంగా 117 జీవో ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు జరుగుతోంది. సబ్జెక్టు టీచర్లు మిగులుగా ఉన్న వారిని అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ఇక్కడే అసలైన లోగుట్టు ఉంది. సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్‌ టీచర్స్‌ (ఎస్‌జీటీ)ను వారి సబ్జెక్టు మెథడాలజీని బట్టి ఉన్నత పాఠశాలలకు కేటాయించడంతోపాటు బలవంతంగా హైస్కూళ్లకు సబ్జెక్టు టీచర్లుగా వెళ్లాలని ఆదేశించారు. దీంతో వారిలో గుబులు మొదలైంది. ఎందుకుంటే గతేడాది ఎస్‌జీటీలకు పదోన్నతులు జరిగాయి. విల్లింగ్‌ ఉన్న ప్రతి ఎస్‌జీటీ పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు వివిధ వ్యక్తిగత కారణాలతో పదోన్నతులు వదులుకుని ఉన్న స్కూళ్లలోనే ఎస్‌జీటీలుగానే కొనసాగుతున్నారు.. కానీ అప్పుడు పదోన్నతులు వదులుకుని ఎస్‌జీటీలుగా కొనసాగుతున్న వారిని మళ్లీ ఉన్న ఫలంగా సబ్జెక్టు ఉపాధ్యాయులుగా హైస్కూళ్లకు వెళ్లాల్సిందేనని హుకుం జారీ చేయడం సబబుగా లేదని పలువురు విమర్శిస్తున్నారు.

పది ఫలితాలపై ప్రభావం
మనస్ఫూర్తిగా పదోన్నతులు వద్దు అనుకుని గతంలో ఎస్‌జీటీలుగా కొనసాగుతున్న వారికి సబ్జెక్టు టీచర్లకు నియమిస్తే దాని ప్రభావం పదవ తరగతి ఫలితాలపై చూపిస్తుందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు అవుతుంది. విద్యార్థులంతా ఆయా సబ్జెక్టు టీచర్లకు అలవాటు పడి ఉంటారు. ఉన్నట్లుండి వారిని వేరే చోటికి సర్దుబాటు చేయడం సరైంది కాదని పలువురు మేధావులు అంటున్నారు. ఇప్పటి వరకు 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులను ఉన్నపళంగా బలవంతంగా సర్దుబాటు చేస్తే ఉన్న పాఠశాలలో బోధన ప్రశ్నార్థకంగా మారుతుందనే గుస గుసలు వినిపిస్తున్నాయి.

ఉన్న మండలంలో కాకుండా..
కొంతమంది ఎస్‌జీటీలను వారు పనిచేస్తున్న మండలంలోనే ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు వారిని సర్దుబాటు చేయకుండా మెథడాలజీ సబ్జెక్టు ఉన్న ఎస్‌జీటీలందరిని జిల్లాస్థాయిలో ఖాళీలు ఉన్న హైస్కూళ్లలో నియమించడం మరొక విడ్డూరం. ప్రస్తుతం 98 కంటే తక్కువగా విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లోని స్కూల్‌ అసిస్టెంట్ల తరలింపుతో అక్కడ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. దీంతోపాటు ఎస్‌జీటీలను హైస్కూల్‌కు తరలింపుతో టీచర్లు లేని ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న ఖాళీలు ఎలా పూరిస్తారోననే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు చాలా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే అవకాశం ఉన్నట్లు తెలిసింది.



ఇప్పట్లో డీఎస్సీ లేనట్టే...
హైస్కూళ్లలో ప్రస్తుతం ఉన్న ఖాళీలకు పదోన్నతులతో చేపట్టాలే తప్ప బలవంతంగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులను సబ్జెక్టు మెథడాలజీ నెపంతో సర్దుబాటు చేయడం వల్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్య నిర్వీర్యం కానుంది. పదోన్నతులు నిర్వహించిన తర్వాత ఏర్పడే ఖాళీలను డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేయాలి. ఉన్న టీచర్లతో సర్దుబాటు చేస్తుంటే ఇక డీఎస్సీ ఎప్పుడు నిర్వహిస్తారని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

సర్దుబాటును ప్రహసనంగా మార్చేసింది...


రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు విధానాన్ని ప్రహసనంగా మార్చేసింది. పని సర్దుబాటు వల్ల పాఠశాలలు నష్టపోకుండా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వం 117 జీఓ ద్వారా సర్దుబాటు చేపడుతుండటంతో ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌ అవుతున్నారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.
- మాదన విజయ్‌కుమార్‌, ఫ్యాప్టో కడపజిల్లా చైర్మెన్‌, యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు

బలవంతపు సర్దుబాట్లు వద్దు


ఉన్నత పాఠశాలల్లో ఉన్న ఖాళీల మేరకు పదోన్నతులు చేపట్టాలి. బలవంతంగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులను సబ్జెక్టు మెథడాలజీ నెపంతో సర్దుబాటు చేయడం సబబుకాదు. వెంటనే పదోన్నతులు నిర్వహించాలి. ఎన్నికల హామీ మేరకు డీఎస్సీని వెంటనే చేపట్టి ఖాళీల భర్తీ చేయాలి. - లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

ఉపాధ్యాయ పోస్టులను కుదించవద్దు


సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను కుదించి ఖర్చు తగ్గించాలని చూడటం సరికాదు. అది విద్యా ప్రమాణాలకు ముప్పు. ప్రాథమిక విద్యలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. అలాగే ఉన్నత తరగతులలో కూడా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:40గా ఉండాలి, అలాంటప్పుడే విద్యా ప్రమాణాలు పెంపొందే వీలుంటుంది. - గునిశెట్టి శ్రీనివాసులు, ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు

వెల్లువెత్తిన క్రీడోత్సాహం



క్రీడాజ్యోతితో కలెక్టర్‌ శివశంకర్‌, క్రీడాకారులు

జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన 3కే క్రీడార్యాలీ ఉత్సాహంగా సాగింది. వేలాదిమంది క్రీడాకారులు, ఎన్‌సీసీ కేడెట్స్‌, విద్యార్థులు తరలిరాగా ఈ ర్యాలీని కలెక్టర్‌ శివశంకర్‌ క్రీడాజ్యోతిని వెలిగించి, జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఆద్యంతం క్రీడాకారులు చేసిన క్రీడా విన్యాస్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్కేటింగ్‌ క్రీడాకారుల ప్రదర్శనలు అలరించాయి ఆరోగ్యమే మహాభాగ్యమని కలెక్టర్‌ అన్నారు. డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. -కడప స్పోర్ట్స్‌



ర్యాలీలో స్కేటింగ్‌ క్రీడాకారుల విన్యాసాలు

రేపటితో ముగియనున్న శ్రావణ శనివారాలు



గండిలో ఉత్సవ ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు,ఎస్సై భాస్కర్‌రెడ్డి

చక్రాయపేట: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా గండి వీరాంజనేయ స్వామికి రేపు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన ఉపప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్‌,రాజగోపాలాచార్యులు తెలిపారు.ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వివరించారు. దీంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి పసుపులేటి శంకర్‌ గారిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఉంటాయని తెలిపారు.రాత్రి ఉత్సవ విగ్రహాల క్షేత్రోత్సవం ఉంటుందని వివరించారు.

గండిలోకి వాహనాలకు నో ఎంట్రీ
శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వాహనాలను గండిలోకి అనుమతించే ప్రసక్తే లేదని ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు.ఎస్సై భాస్కరరెడ్డి తెలిపారు. లారీలు,బస్సులు,కార్లు,మోటారు సైకిల్లను సైతం గండిలోకి అనుమతించమని చెప్పారు. రాయచోటి వైపు నుంచి వచ్చే లారీలు టిప్పర్లు వంటి వాటిని చిలేకాంపల్లె, వేంపల్లె వైపు నుంచి వచ్చే వాటిని వేంపల్లె పెట్రోల్‌ బంకు వద్దనే ఆపేస్తామన్నారు. మిగిలిన వాటిని అద్దాలమర్రి క్రాస్‌,ఇడుపులపాయ క్రాస్‌ల వద్దను ఆపేస్తామని చెప్పారు. భక్తులు సహకరించాలని కోరారు.

పాలన భాషగా తెలుగు అమలు కావాలి

- కలమల్ల శాసనం తెలుగు వారికి గర్వకారణం
- భాష ప్రాచీనతకు శాసనాలే పునాదులు
- తెలుగుభాషా దినోత్సవంలో వెంకయ్యనాయుడు, వక్తలు



శాసనాలను తిలకిస్తున్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు





కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ప్రజలు (ఇన్‌సెట్‌) నృత్య ప్రదర్శన

కడప కల్చరల్‌: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలనా భాషగా తెలుగును తప్పక అమలు చేయాల్సి ఉందని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గురువారం జిల్లాలోని ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగుభాష అమలుపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, పాలనా భాషగా తెలుగును తప్పక అమలు చేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. కలమల్లలో తొలి తెలుగు శాసనం లభించడంతోనే ప్రస్తుతం ఇక్కడ తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చి ఆ శాసనాన్ని దర్శించుకున్నందుకు తెలుగువాడిగా గర్విస్తున్నామన్నారు. భాష ప్రాచీనతకు శాసనాలే పునాదుల్లాంటివని అన్నారు. దిగువస్థాయి కోర్టుల వరకు తెలుగును అమలు చేయాలన్నారు. పెన్నానది ఒడ్డున ఉన్న ప్రభావంతో ప్రొద్దుటూరు సాహిత్య కేంద్రంగా ఎందరో గొప్ప కవులకు నిలయంగా మారిందన్నారు. ఇక్కడ రామాయణ భారత భాగవతాలకు చక్కని వ్యాఖ్యానం రాశారన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మన పిల్లలను తెలుగులోనే చదివించాలన్నారు. కలమల్ల థర్మల్‌ స్టేషన్‌ పక్కనే త్వరలో రూ. 10 వేల కోట్లతో ఉక్కు ఫ్యాక్టరీ రానుందని, 750 మెగా వాట్ల సోలార్‌ ఇండస్ట్రీ రానుందన్నారు. కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలు ఎందుకు చేస్తున్నామో నేటితరం వివరంగా తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు పదం ఆవిర్భావం, పరిణామక్రమం గురించి వివరించారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కూడా మాట్లాడారు. వేదికపై జాయింట్‌ కలెక్టర్‌ అదితిసింగ్‌, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, బీజేపీ యువ నాయకులు భూపేష్‌రెడ్డి కూడా ఆశీనులయ్యారు.

కవులకు సత్కారం
ఈ వేదికపై స్థానిక ప్రముఖ కవులకు తెలుగు భాషా దినోత్సవ పురస్కారాలను అందజేశారు. సీనియర్‌ కవి అవధాని నరాలరామారెడ్డి, డాక్టర్‌ పి.సంజీవమ్మ, తవ్వా ఓబుల్‌రెడ్డిలకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వెంకయ్యనాయుడు ఇంటాక్‌ కడపశాఖ కన్వీనర్‌ లయన్‌ కె.చిన్నపరెడ్డి ప్రచురించిన మన చరిత వారసత్వ బులిటెన్‌ను ఆవిష్కరించారు. తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత వేదికపై తెలుగు ప్రముఖుల చిత్రపటాలకు పుష్పాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన తెలుగుభాష ప్రాచీనతను తెలిపే ఛాయాచిత్రాల ప్రదర్శనను కలెక్టర్‌, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఇతర అతిథులతోకలిసి సందర్శించారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఈఓ అనూరాధ, వివిధ శాఖల అధికారులు, భాషోపాధ్యాయులు, ఆర్టీపీపీ అధికారులు, సమీప పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా విధులు నిర్వర్తించేలా చూడాలి



ప్రతి వైద్య విద్యార్థి, వైద్యులు స్వేచ్ఛాయుతంగా విధులు నిర్వహించాలి. ప్రశాంత వాతావరణంలో వైద్య విద్యను అభ్యసించే విధంగా చూడాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శిక్షణ పొందిన సెక్యూరిటీని నియమించాలి. రక్షణ యాప్‌లపై అధ్యయనం చేయాలి.

- డాక్టర్ ఎ. దాశరథి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ దంతవైద్య కళాశాల, హాస్పిటల్, కడప

సెల్‌ఫోన్ తీసుకువెళ్లాలి



వైద్య విద్యార్థులు, వైద్యులు తమనుతాము రక్షించుకునేలా, ఆపద ముంచుకొచ్చే సమయంలో సెల్‌ఫోన్ ద్వారా పోలీసు, సెక్యూరిటీ సహాయం కోరే విధంగా ఎక్కడికి వెళ్లినా సెల్‌ఫోన్‌ను తమ వెంటనే తీసుకుని వెళ్లాలి. పోలీసు సహాయం కోసం 'దిశ' ఎస్‌ఓఎస్ లేదా పోలీస్ సహాయం యాప్‌లను తమ సెల్‌ఫోన్‌లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆపద సమయాల్లో ఉపయోగపడతాయి.

- డాక్టర్ స్వప్న నిగమ్, పీజీ వైద్య విద్యార్థిని, ప్రభుత్వ దంతవైద్య కళాశాల, కడప ప్రభుత్వ ఆసుపత్రి



కఠిన చట్టాలు రూపొందించాలి



కోల్‌కతా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు ఎక్కడా జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలి. రాత్రి వేళలో విధులు నిర్వహించే మహిళల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

- గాయత్రి, ల్యాబ్ టెక్నీషియన్, సింహాద్రిపురం మండలం

నిందితులను శిక్షించాలి



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. రోగులను రక్షించేందుకు నిత్యం రాత్రిళ్లు పనిచేస్తే మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. రాత్రి పూట స్వేచ్ఛగా విధులు నిర్వహించే వెసులుబాటు కల్పించాలి. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిఘా పెట్టాలి.


-డాక్టర్ షామీరా ఇస్రత్, వైద్య విద్యార్థిని ఫాతిమా వైద్య కళాశాల, కడప

డేంజర్ హైవే!

నేటి రోజుల్లో సహజ మరణాలకంటే.. రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలిస్తున్న ఘటనలే ఎక్కువ. ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి క్షేమగా తిరిగి వస్తాడా.. లేదా అని చెప్పలేని పరిస్థితి. కడప-రేణిగుంట హైవే (ప్రస్తుతం) డేంజర్‌గా మారింది. ఈ దారిలో నిత్యం ఏదో ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

- నిత్యం ప్రమాదాలతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- 20 వేర్వేరు ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తింపు
- ఆక్రమణలతో సింగల్ రోడ్డుగా మారుతున్న వైనం

రాజంపేట ఎస్‌డీపీఓ పరిధిలో ప్రమాదాల వివరాలు ఇలా ఉన్నాయి..



రాజంపేట : కడప-రేణిగుంట హైవే రెండు దశాబ్దాల కిందట సింగల్ రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డుగా మార్చారు. ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో కొనసాగుతున్నా.. రహదారి అభివృద్ధి, ఆక్రమణలపై దృష్టి పెట్టడం లేదు.

ప్రస్తుతం ఈ హైవేలో ప్రయాణం నరకంగా మారుతోంది. ఎటువైపు నుంచి ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితి. కడప శివారులోని జెఎంజె కళాశాల నుంచి భాకరాపేట సర్కిల్, మాధవరం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, మంగంపేట, రైల్వే కోడూరు, శెట్టిగుంట, కుక్కలదొడ్డి వరకు ఈ దారిలో ప్రయాణం కత్తిమీద సాములా మారింది. పేరుకు హైవేలైనా.. భారీ మలుపులు ఉండడం, వాహనాలు వేగంగా దూసుకు రావడం, నియంత్రణ కోల్పోవడం వంటి ఘటనలు నిత్యం ప్రయాణికులను యమ పురికి పంపిస్తున్నాయి. ఒంటిమిట్ట, నందలూరు, రెడ్డిపల్లె కట్టపై వాహనాలు అదుపుతప్పి చెరువులో పడిన సంఘటనలున్నాయి.

యాత్రికుల రోడ్డుగా..

దక్షిణ భారతదేశం నుంచి తిరుమలకు కడప-రేణిగుంట మీదుగా వేలాది యాత్రికులు వాహనాల ద్వారా చేరుకుంటున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర,



కడప-రేణిగుంట జాతీయరహదారి

కర్ణాటకతోపాటు రాజస్థాన్, యూపీ తదితర రాష్ట్రాల నుంచి వేలాది యాత్రికులు ప్రయాణం ఈ మార్గంలోనే కొనసాగిస్తుంటారు. అయితే వారి వాహనాలు అనేక సార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. తుపాను, ఇతర వాహనాల్లో యాత్ర కొనసాగించడం అధికంగా ఉంటుంది. తిరుపతి, చెన్నై, ముంబాయి, హైదరాబాద్‌కు రాకపోకలు జరుగుతున్నాయి. కడప-రేణిగుంట హైవేలో ట్రాఫిక్ రోజు రోజుకూ పెరుగుతోంది. నిత్యం 17 వేలకు పైగా వాహనాలు పరుగుతీస్తున్నాయి. అంతేగాక.. ఈ మార్గంలో రోడ్డు ప్రయాణం రెండు నుంచి మూడుగంటలకు పైగా పడుతోంది. సకాలంలో గమ్యాలకు చేరలేని పరిస్థితి.

ప్రతి చోట బ్లాక్ స్పాట్స్

కడప-రేణిగుంట హైవేలో ప్రతి మండల పరిధిలో బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. రాజంపేట అర్బన్‌లో 3, నందలూరు 2, రైల్వేకోడూరు 3, పుల్లంపేట 3 ఓబులవారిపల్లి 6, మన్నూరు 3తో పాటు అలాగే ఒంటిమిట్ట, మాధవరం, భాకరాపేటలో కూడా ప్రమాదానికి దారితీసే ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలు సర్వే చేసి కడప-రేణిగుంట ప్రస్తుత హైవేలో ప్రమాదాలు జరుగుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పెద్దాసుపత్రిలో ట్రామా సెంటర్ కూడా ఏర్పాటుచేశారు.

గ్రీన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే ప్రత్యామ్నాయం

పాత హైవేకి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం గ్రీన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే రోడ్డు(716)ను తీసుకొచ్చింది. రూ.3వేల కోట్ల వ్యయంతో తక్కువ సమయంలో తిరుపతి చేరేలా 133 కిలోమీటర్ల హైవేను తీసుకొస్తున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో రైలుమార్గానికి పడమర వైపు కొనసాగుతోంది. తిరుపతి, చెన్నై నగరాలకు త్వరగా చేరుకునేందుకు ఈ మార్గం దోహదపడుతుంది. అంతేగాకుండా భారీ వాహనాలు, దక్షిణ భారత దేశాల నుంచి వచ్చే యాత్రికులు ఇక్కడ వెళ్లనున్నాయి. ఫలితంగా ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాద నివారణా చర్యలు అవసరం



కడప-రేణిగుంట జాతీయ రహదారిలో పకడ్బందీగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి. కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలి. భాకరాపేట నుంచి రేణిగుంట వరకు ఎక్కడో ఓ చోట నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

- ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

భద్రతా వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు భద్రతా వారోత్సవాల ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పుతున్నాం. మద్యం తాగి డ్రైవ్ చేయరాదని, లైసెన్స్ తప్పనిసరి అని వివరిస్తున్నాం. ఇప్పటికే బ్లాక్ స్పాట్స్ గుర్తించారు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు పెంచి ప్రమాదాలను నియంత్రిస్తాం.

- వినోద్‌కుమార్, ఎంవీఐ, రాజంపేట

జన్‌ధన్ ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీజీబీ ఛైర్మన్ సత్య ప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్‌ధన్ యోజన ప్రారంభించి నేటికి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ సత్య ప్రకాశ్‌సింగ్ తెలిపారు. స్థానిక మరియాపురంలోని ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుమారు 11 లక్షల మంది ఖాతాదారులకు జన్‌ధన్ యోజన పథకం యొక్క ప్రయోజనాలైన జీరో బ్యాలెన్స్ అకౌంట్, రూ.10వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, రూ.2 లక్షల రూపె కార్డుతో ప్రమాద బీమా సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. జన్‌ధన్ ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లను పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన గుద్దేటి ప్రభాకర్‌రెడ్డి అదృశ్యమైనట్లు ఎస్ఐ కత్తి వెంకట రమణ గురువారం తెలిపారు. బుధవారం ఉదయం ప్రభాకర్‌రెడ్డి మైదుకూరుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడన్నారు. ఇంత వరకూ తిరిగి రాకపోవడంతో ప్రభాకర్‌రెడ్డి భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9121100600 నంబర్‌కు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు పింఛన్లు నిలిపివేత

కొండాపురం: మండలంలోని ఎన్‌టీఆర్ పింఛన్ భరోసా పథకం కింద 78 మంది దివ్యాంగులకు పింఛను నగదు నిలిపివేసినట్లు ఎంపీడీవో నాగ ప్రసాద్ గురువారం తెలిపారు.ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 239 మందికి సంబంధించిన ఇతర జిల్లాల సదరం సర్టిఫికేట్ విచారించాలని రెండు నెలల కిందట నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

దివ్యాంగులకు నోటీసులు

బ్రహ్మంగారిమఠం : మండలంలో పింఛను అందుకుంటున్న పలువురు దివ్యాంగులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఇందులో డి.నేలటూరులో 1, గొడ్లవీడులో 1, మల్లేపల్లెలో 4, ముడుమాలలో 8, తోట్లపల్లెలో 1, పలుగురాళ్లపల్లెలో 1, సోమిరెడ్డిపల్లెలో 9 మందికి నోటీసులు ఇచ్చారు.

డిజిటల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పంచాయతీశాఖలోని డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం జరిగింది. కడప జెడ్పీ కార్యాలయం ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌కు 167 మంది డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. బదిలీల కోసం వైఎస్సార్ జిల్లాకు సంబంధించి 111 మంది, అన్నమయ్య జిల్లాకు సంబంధించి 67 మంది దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలకు సంబంధించిన దరఖాస్తుతోపాటు వివిధ సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నామన్నారు. ప్రక్రియ ముగిశాక పింఛన్ల పపిణీ అనంతరం బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేస్తామన్నారు. అలాగే ఈ నెల 30న గ్రేడ్-5 సెక్రటరీలకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, వెంకటసుబ్బయ్య, రమణారెడ్డి, మస్తాన్‌వలి, సురేష్, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కడప బిగ్ టీవీ రిపోర్టర్‌పై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మేయర్ కె.సురేష్‌బాబు ఇంట్లోకి చెత్త వేసేందుకు టీడీపీ కార్యకర్తలను ప్రోత్సహించిన కడప బిగ్ టీవీ ఛానెల్ రిపోర్టర్ బొమ్మలాట మధుసూదన్‌పై కేసు నమోదైంది. ఈ నెల 27న మేయర్ సురేష్‌బాబు ఇంటి ఎదుట ఆందోళన చేసేందుకు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి ఉసిగొల్పడంతోనే మేయర్ ఇంట్లోకి చెత్త వేశారని వైఎస్ఆర్‌సీపీ నాయకులు తెలిపారు. మేయర్ ఫిర్యాదు మేరకు టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బొజ్జా తిరుమలేష్, మరింత మందిపై క్రైం.నెం.304/2024లో కేసు నమోదైంది.

ఈ కేసులో ఆందోళన కారులను ప్రోత్సహించి చెత్తను ఇంటిలోకి విసిరేయించాడని కడప బిగ్ టీవీ ఛానెల్ రిపోర్టర్‌పై ఫిర్యాదులో తెలుపడంతో అతడిని నిందితుడిగా చేర్చినట్లు చిన్నచౌక్ సీఐ తేజ మూర్తి తెలియజేశారు. మధుసూదన్ గతంలో ఏబీఎన్ ఛానెల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న సమయంలో అదే చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండాయపల్లి సమీపంలో ఓ పెప్సీ గోదాముపై దాడి చేసిన సంఘటనలో క్రైం నెం.214/2023 లో నమోదైన హత్యాయత్నం, ఇతర సెక్షన్లతో కేసులో రెండో నిందితుడిగా వున్నాడు.

ఆధిక్యంలో చిత్తూరు జట్టు



140 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్‌గౌడ్



112 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ చరణ్‌జీత్



6 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ దత్తారెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 22 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 92 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 420 పరుగులు చేసింది. జట్టులోని చరణ్‌జీత్ 112 పరుగులతో నాటౌట్‌గా నిలువగా, నిఖిత్ గౌడ్ 140 పరుగులతో రాణించారు. వీరితో పాటు శశాంక్ శ్రీవత్స 61, తేజారెడ్డి 63 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ భార్గవ్ 2 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 140 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

విజయం దిశగా అనంత జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 160 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని మహేంద్రారెడ్డి 30 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ కనిష్ 4 వికెట్లు, సాబ్జాన్ బాషా 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 40.4 ఓవర్లలో 206 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 55 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు దత్తారెడ్డి 6 వికెట్లు, లోహిత్‌సాయి 2 వికెట్లు తీశారు. అనంతరం 190 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ రోషన్ 35 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కర్నూలు బౌలర్ సాబ్జాన్ బాషా 2 వికెట్లు తీశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

అక్రమ మద్యం పట్టివేత

పులివెందుల రూరల్ : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పులివెందుల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాయలపురం వద్ద పులివెందుల అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, ఎస్ఐ నారాయణ వాహనాల తనిఖీ చేపట్టారు. బెంగళూరు నుంచి పులివెందుల వైపు వస్తున్న లారీని తనిఖీ చేశారు. భారీగా మద్యం ఉన్నట్లు గుర్తించి డీఎస్పీ మురళీనాయక్ లారీని పరిశీలించారు. వివరాలను తర్వాత వెల్లడిస్తామన్నారు.

మైలవరం జలాశయానికి నీరు విడుదల



జలాశయానికి చేరుతున్న కృష్ణా జలాలు

కొండాపురం : గండికోట జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి 7500 క్యూసెక్కుల కృష్ణా జలాలను మైలవరం జలాశయానికి విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారి డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మైలవరం జలాశయం కింద సాగు, తాగు నీటి అవసరాలకు నీటిని విడుదల చేశామన్నారు. గండికోట జలాశయంలో 18.8టీఎంసీల నీరు ఉందన్నారు. శెట్టివారి పల్లె హెడ్ రెగ్యులేటర్ ద్వారా వామికొండకు 200 క్యూసెక్కులు, సర్వరాయసాగర్‌కు 300 క్యూసెక్కులు, పైడిపాలేనికి ఎనిమిది మోటార్లతో 880 క్యూసెక్కుల నీటిని పంపుతున్నామన్నారు. జీకేఎల్-1 ద్వారా రెండు మోటార్లతో 1000 క్యూసెక్కులు పంపింగ్ చేస్తున్నామన్నారు.

ఇరువర్గాల మధ్య భూ వివాదం

చాపాడు: మండలంలోని వీరభద్రాపురం వద్ద 22సెంట్ల భూమి విషయంలో బద్వేల్ సురేంద్రనాథరెడ్డి, వరికూటి గురివిరెడ్డి వర్గీయుల మధ్య బుధవారం అర్ధరాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి చెందిన సురేంద్రనాథ్, చంద్రమోహన్‌రెడ్డితో కలిసి బైక్‌లో బుధవారం రాత్రి అన్న జగన్నాథరెడ్డి ఇంటికి వచ్చారు. అనంతరం తిరిగి లక్ష్మీపేట మీదుగా వెళ్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గురివిరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, గురుమోహన్‌రెడ్డి, మరో నలుగురు సురేంద్రనాథరెడ్డి, చంద్రమోహన్ రెడ్డిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఎల్‌ఐసీ ఆటల పోటీలు



పోటీల విజేతలతో అతిథులు

కడప కల్చరల్ : కడపలో రెండు రోజులుగా జరుగుతున్న ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ చెస్, క్యారమ్స్ సెంట్రల్ ట్రయల్స్-2024 పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. కడప నగరం శ్రీనివాస రెసిడెన్సీలో బుధవారం ప్రారంభమైన ఈ పోటీల్లో క్రీడాకారుల మధ్య ఆద్యంతం పోటీలు ఆసక్తిగా కొనసాగాయి. అనంతరం జరిగిన ముగింపు సభలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ.రవికుమార్ మాట్లాడారు. జోనల్ సెలక్షన్ ట్రయల్స్‌లో విజేతలు నేషనల్ ఛాంపియన్స్ కావాలని ఆకాంక్షించారు. ప్రఖ్యాత ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్ చీఫ్ ఆర్బిటర్‌గా వ్యవహరించారు.

విజేతలు వీరే

చెస్ పురుషుల విభాగంలో మచిలీపట్నం డివిజన్‌కు చెందిన శ్రీనివాసులు ప్రథమ, కడపకు చెందిన శ్రీధర్ ద్వితీయ, సికింద్రాబద్ వాసి మహేంద్రకుమార్ తృతీయ, బెంగళూరుకు చెందన చంద్రశేఖర్ మూర్తి నాలుగో స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో రాజమండ్రికి చెందిన రాధాకుమారి ప్రథమ, సికింద్రాబాద్‌కు చెందిన హరిత భార్గవి ద్వితీయ, మచిలీపట్నానికి చెందిన రాధికాదేవి తృతీయ, హైదరాబాద్‌కు చెందిన రేణుకాకుమారి నాలుగో స్థానంలో నిలిచారు. క్యారమ్స్ పోటీలకు అంతర్జాతీయ రిఫరీ షేక్ అబ్దుల్ జలీల్ చీఫ్ రిఫరీగా వ్యవహరించారు.

క్యారమ్స్ విజేతలు

క్యారమ్స్ పోటీల్లో పురుషుల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన బి.వీరలింగం, అజయ్‌కుమార్, బెంగళూరు వాసి శివదాస్, హైదరాబాద్‌కు చెందిన అవినాష్ అప్టే మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన అపూర్వ, షిమోగాకు చెందిన అనాలదేవి, బెంగళూరుకు చెందిన సవిత, హైదరాబాద్‌కు చెందిన జయశ్రీ వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. కడప డివిజన్ ఎల్ఐసీ ఎస్‌డీఎం జీకేఆర్‌వీ రవికుమార్, పీఎం సత్య శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు.

హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలో క్రీడా స్ఫూర్తి నిలబెడతామని క్రీడాకారులు అన్నారు. పోటీల్లో విజేతలు నవంబర్ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జైపూర్‌లో జరిగే ఆల్ ఇండియా ఎల్ఐసీ గేమ్స్‌లో పాల్గొంటారని జీకేఆర్.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ స్పోర్ట్స్ ప్రమోషన్ సభ్యుడు సురేష్, డీవీఎస్ శర్మ, డివిజన్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు జె.రఘు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



వైద్య పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : ఉద్యోగ రీత్యా విధుల్లో వుండే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ సంక్షేమ ఆసుపత్రిలో జైడస్ హెల్త్ కేర్ ఏర్పాటుచేసిన అత్యాధునిక లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఎస్పీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఖరీదైన లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారని, సిబ్బంది సకాలంలో వ్యాధికి చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 3, 4వ తేదీలలో విజయవాడ, మణిపాల్ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ.కృష్ణారావు, డాక్టర్ మేరీ సుజాత, ఆనంద్, శ్రీశైలరెడ్డి, టైటస్, వీరేష్, దూలం సురేష్, ఉప్పు శంకర్, తరుణ్, ప్రసాద్, రమణారెడ్డి, పోలీసులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్లోబల్ ఐటీ సమ్మిట్‌లో వేంపల్లె వాసి



ఐటీ మంత్రితో వేంపల్లె వాసి సునీల్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : తెలంగాణాలో పరిశ్రమలకు పెట్టుబడికి సంబంధించి జరిగిన గ్లోబల్ ఐటీ సమ్మిట్ వైఎస్సార్ జిల్లా వేంపల్లెకు చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

గ్లోబల్ బిజినెస్ స్ట్రాటజీ లీడర్‌గా పేరుగాంచిన సునీల్‌కుమార్‌రెడ్డి ఇటీవల తెలంగాణ ఐటీ మంత్రితో వ్యూహాత్మక చర్చలు జరిపారు. రాష్ట్రానికి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ప్రత్యేకించి ఎఐఎల్, ఎంఎల్, డెలివరీ రంగాల్లో ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డీ కేంద్రాల స్థాపనపై ప్రధానంగా చర్చించినట్లు సునీల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో సెమీ కండక్టర్, మొబిలిటీ కేంద్రాల ఏర్పాటుపై గ్లోబల్ కంపెనీల ఆసక్తిని ఐటీ మంత్రి శ్రీధర్ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. పెట్టుబడులను సులభతరం చేయడంతోపాటు తెలంగాణ అత్యాధునిక సాంకేతికత, పరిశోధనలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ఆర్థిక వృద్ధిని పెంచడం, ఎక్కువగా ఉపాధి అవకాశాలను అందించడం లక్ష్యంగా గ్లోబల్ బిజినెస్ పని చేస్తుందన్నారు. అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలకు ప్రాధాన్యత కలిగిన గమ్యస్థానంగా తెలంగాణ కీర్తిని పెంచుతాయన్నారు.గ్లోబల్ ఐటీ సమ్మిట్‌లో ఐటి మంత్రితో పరిశ్రమల పెట్టుబడులపై చర్చించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడికి జాతీయ సాహితీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సత్తెనపల్లి బాబు

జమ్మలమడుగు రూరల్: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ సత్తెనపల్లిబాబు రాసిన 'వీరశైవ సాహిత్యం - సామాజిక దృక్పథం' పుస్తకం జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన ముని మనవరాలు గిడుగు ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు క్రాంతి కృష్ణ చేతుల మీదుగా డాక్టర్ బాబుకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. సత్తెనపల్లి బాబు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నాయనిపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో పలు రచనలు చేశారు. బసవ పురాణం, ఒక పరిశీలన, వీరశైవ సాహిత్యం సామాజిక దృక్పథం వంటిపుస్తకాలు ఈయన కలం నుంచి ఆవిష్కృతమైనవే. తెలుగు సాహిత్యంపై ఈయన చేసిన కృషికి ఫలితంగా రెండు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి ఆయన సోమనాథ సాహిత్య పురస్కారం, తెలంగాణ రత్న అవార్డు, ఉగాది జాతీయ పురస్కారం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు గతంలో అందుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన బాబు అదే యూనివర్సిటీ నుంచి పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.